క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం


గుడి పై పడిన విద్యుత్ తీగలు

కంభం: స్థానిక కందులాపురం కూడలిలో హైవేకి ఓ వైపు 11 కేవీ విద్యుత్ స్తంభాలకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీగలు తెగి పడి అక్కడ ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తెగిపడిన తీగలు హైవేని ఆనుకొని ఉన్న ఆలయంపై పడటంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. సుమారు మూడు గంటల సేపు విద్యుత్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీఎస్పీ

కంభం: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు, పాత్రికేయులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు, పట్టణంలో పలువురు యువకులు 130 మంది వరకు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి పోలీసులు పండ్లు, జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐ కె.మల్లిఖార్జున, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు ఎస్సైలు నరసింహారావు, రవీంద్రరెడ్డి, సుదర్శన్, కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

29న మున్సిపల్ రూముల వేలంపాట

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి వివిధ సెంటర్‌లలోని 10 షాపులు, 2 బంకులకు ఈ నెల 29న ఉదయం 11గంటలకు కార్యాలయంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ నారాయణరావు ఆదివారం తెలిపారు. పట్టణ పరిధిలోని కొత్త మార్కెట్ పడమర వైపు, దక్షిణం వైపు, ఈ సేవా సెంటర్, పాత బస్టాండ్ పడమర వైపు, అయ్యప్ప స్వామి గుడి ఎదురు వైపు, పాత మార్కెట్ సెంటర్ తూర్పువైపు, గాంధీ పార్కు సెంటర్ దక్షిణం వైపు ఉన్న మొత్తం 10 షాపులు, రెండు బంకులకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ షాపులు మూడేళ్ల పాటు వేలంపాటదారుడు నిర్వహించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు కార్యాలయం పనివేళల్లో రెవెన్యూ విభాగంలో అధికారులను సంప్రదించవచ్చన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పొదిలి రూరల్: పవిత్ర కార్తీక మాసంలో భక్తులు వివిధ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు పొదిలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం జె.సుందరరావు తెలిపారు. వచ్చే నవంబర్ 4వ తేదీ నుంచి ప్రతి కార్తీక సోమవారం పంచారామదర్శనం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అమరారామం, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారరామాలకు వెళ్లేందుకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తుల కోరిక మేరకు కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు కార్తీక పౌర్ణమిరోజున బస్సులు బయలుదేరుతాయన్నారు. ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.1700, సూపర్‌లగ్జరీ చార్జీ రూ.2200 నిర్ణయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతపరుస్తాం


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

మార్కాపురం: మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87 బ్యాచ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బ్యాచ్ తరుపున ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, పాఠశాలకు పుస్తకాల వితరణ, శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో వీటికి అదనంగా మరికొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి తన్నీరు వెంకటరమణ, శ్రీనివాస మల్లికార్జున్, విశ్వం, అక్కల నారాయణ, దాసరి వెంకటేశ్వర్లు, ఎమ్ఆర్‌కె బాష, నాగరాజు, రహంతుల్లా, సర్పంచ్ రమణారెడ్డి, ప్రకాష్, నరసింహారావు, కాళంగి శ్రీనివాసులు, వెంకటరావు, డాక్టర్ బాష పాల్గొన్నారు.

టమోటా రైతుకు తీరని నష్టం


తర్లుపాడులో నీటమునిగి చనిపోయిన టమోట పంట


మార్కాపురం మండలంలో నీటిలో తడిసి నేల రాలిన టమోటా

- మార్కాపురం ప్రాంతంలో సుమారు వంద ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ రైతుల వేడుకోలు

తర్లుపాడు: అసలే పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి అంతంత మాత్రంగా ఉన్న టమోటా రైతులు అల్పపీడన ప్రభావంతో తీవ్ర నష్టానికి గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు పశ్చిమ ప్రకాశంలోని తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల, మార్కాపురం రూరల్, బేస్తవారిపేట, కంభం, గిద్దలూరు, యర్రగొండపాలెం మండలాల్లో వందల ఎకరాల్లో పంట దెబ్బతింది. వ్యయ ప్రయాసల కోర్చి సాగుచేసిన పంట పక్వ దశలో ఉండి ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.50 వరకూ టమోటా విక్రయిస్తున్నారు. మార్కాపురం కూరగాయల మార్కెట్‌కు ఇంకా స్థానికంగా లభించే టమోటా రాకపోవడంతో బెంగళూరు, మార్టూరు, కర్నూలు నుంచి ప్రతిరోజూ దిగుమతి చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కష్టాలు తీరుతాయని భావించిన రైతన్నలకు వర్ష ప్రభావంతో పంటల్లో నీరు నిలిచి మొక్కలు, పిందెలు దెబ్బతినడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఎకరాకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ పెట్టుబడి ఖర్చైనట్లు రైతులు చెబుతున్నారు. నీటమునిగిన పంట చూసేందుకు వచ్చిన అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంలేదని ఆవేదన చెందుతున్నారు. వర్షాభావం వలన పంట పూర్తిగా చనిపోవడంతో ప్రభుత్వం పంట నష్టం అందజేయాలని రైతులు వేడుకుంటున్నారు.

మండలం	టమోటా సాగు ఎకరాల్లో
మార్కాపురం	36.53
తర్లుపాడు	43
కొనకనమిట్ల	13.74
దొనకొండ	0.50

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న రెండెకరాల పొలంలో టమోటా పంట వేశాను. వర్షానికి ముందు టమోటా తోట పూత, పిందెతో ఉంది. కురిసిన వర్షాలకు నీరు నిలబడి పంట చనిపోయింది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి టమోటా పంట సాగుచేశాను. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– మేకల జనార్ధన్‌రెడ్డి, రైతు, తాడివారిపల్లి

పంట నష్టం వివరాలు తెలియజేశాం



పంట నష్టం అంచనాను ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియచేశాం. అన్నీ మండలాల్లో పంట పొలాలను పరిశీలించి అంచనాలు తయారుచేశాం. ఉన్నతాధికారులకు పంట నష్టం నివేదిక అందచేశాం.

– రమేష్, హెచ్ఓ, మార్కాపురం

టీడీపీ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదు


మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి నరసింహారావు

బేస్తవారిపేట: టీడీపీ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదని జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కేటాయించలేదు, అయినా పొత్తు ధర్మాన్ని పాటించామని, టీడీపీ కోసం పనిచేశామన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించే స్థాయికి కొందరు టీడీపీ నాయకులు ఎదిగారన్నారు. ఇతర పార్టీ నాయకులను చేర్చుకునేటప్పుడు టీడీపీ నాయకులను సంప్రదించాలనే ఇంగిత జ్ఞానం లేదా అని పవన్‌కళ్యాణ్‌ను ప్రశ్నించడంపై ధ్వజమెత్తారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి రావడం జీర్ణించుకోలేక బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని, ఆయన తప్పు చేసి ఉంటే అధికారం ఉపయోగించి శిక్షించాలి కానీ దిగజారిన మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దగ్గరుండి జనసేనపై విమర్శలు చేయించడం తగదని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు.

ఇది సిమెంటు రోడ్డే.. నమ్మండి


అంకాలమ్మ అరుగు దగ్గర ప్రధాన రహదారి దుస్థితి

- అధ్వానంగా సలనూతల ప్రధాన రహదారి

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల (గాజులపల్లి) ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. కాలు తీసి బయటపెట్టాలంటే రొచ్చులో కాలుపెట్టినట్లే ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది సిమెంటు రోడ్డు అంటే కొత్తవారు ఎవరూ నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నారు. సైడు కాలువలు ఎత్తుగా నిర్మించటంతో రోడ్డుపై వర్షం నీరు సైడు కాలువల్లోకి చేరటం లేదు. ఎక్కడివక్కడ రోడ్డుపైనే నిల్వ ఉంటున్నాయి. మరో వైపు అరడుగు మేర మేట మట్టి చేరింది. నిత్యం రాకపోకలు సాగించే దారి అధ్వానంగా ఉండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం వర్షాకాలంలో ఎలా ఉందో ఇప్పుడు అలానే ఉందని వృద్ధులు చెప్పారు. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొట్లగట్టు విద్యార్థి


అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన నరహరిని అభినందిస్తున్న హెచ్ఎం

కొనకనమిట్ల: వచ్చే నెల 4,5 తేదీల్లో ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారుడు పెండెం నరహరి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, పీడీ వై.బాలగురవయ్య తెలిపారు. ఈ సందర్భంగా పీడీ బాలగువయ్య మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పెండెం నరహరి ఈ నెల 25న ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో నరహరి 400 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, లాంగ్ జంప్‌లో రెండవ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారుడు నరహరిని హెచ్ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల క్రీడాకారులు అథ్లెటిక్స్, కబడ్డీ, రెజ్లింగ్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ సత్తా చాటి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు తర్ఫీదు నిచ్చిన పాఠశాల పీడీ బాలగురవయ్యను, ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా తమ పాఠశాల క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు


మాట్లాడుతున్న వీరారెడ్డి

పొదిలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం రాత్రి స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కొనకనమిట్ల మండల శాఖ అధ్యక్షుడు నాసర్‌మహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ ఏర్పాటు చేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఫలితంగా అప్రెంటిస్ రద్దు, కౌన్సెలింగ్ విధానం, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం, రీ గ్రూపింగ్ స్కేల్ ఉపాధ్యాయులు సాధించుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 115ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగ వ్యవస్థను కాపాడాలన్నారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమస్యల పరిష్కారానికి పునరంకితమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి చల్లగా దీవించమ్మా..!


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


ప్రత్యేక అలంకణలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ చల్లగా దీవించమ్మా అంటూ భక్తులు మొక్కుకున్నారు. పోలేరమ్మ కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలోని నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెలు తీర్చి అందరినీ చల్లగా చూడాలని మార్కాపురం పట్టణ శివారులో ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

కాశిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే అన్నా నివాళి


కాశిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నపురెడ్డి కాశిరెడ్డి (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు కొండారెడ్డిపల్లె చేరుకుని కాశిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు మందా కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి


నూతన కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు బి.నరసింహులు అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక పై హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక ఇవ్వకుండా ప్రభుత్వమే ఉచిత ఇసుక పంపిణీ చేయాలన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తకార్డులు ఇవ్వాలని, పాతకార్డులను రెన్యువల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గిద్దలూరు మండల అధ్యక్షుడుగా కె.నారాయణ, ఉపాధ్యక్షుడిగా షేక్.మహమ్మద్, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా డి.శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో మంచి భవిష్యత్



ఇండస్ట్రియల్ విజిట్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్: వృత్తి విద్యా కోర్సులు నేర్చుకునే విద్యార్థులకు భవిష్యత్‌కు ఉపాధి మార్గాలు మెండుగా ఉంటాని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని మార్కాపురం ఏ1 గ్లోబల్ కళాశాలను ఆదివారం సందర్శించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కళాశాలలోని ప్రయోగశాలలను సందర్శించారు.

హెల్మెట్ విధిగా ధరించాలి


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పొదిలి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సాయి రాజేశ్వరరావు పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలను నడిపటం చట్టరీత్యా నేరమని చెప్పారు. వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. రోడ్డు నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఎస్సై వేమన పాల్గొన్నారు.

యూటీఎఫ్ అధ్యక్షునిగా నాసర్‌మహ్మద్


ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

పొదిలి: స్థానిక శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం రాత్రి యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాసర్‌మహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కామేశ్వరరావు, గౌరవాధ్యక్షునిగా యద్దం శ్రీనివాసులు, సహాధ్యక్షునిగా టి.నరసింహారావు, వైఎస్ఎన్ జ్యోతి, కోశాధికారిగా వై.హరిబాబు, మహిళా కార్యదర్శిగా పూల విజయలక్ష్మి, మండల కార్యదర్శులుగా జి.కాశిరెడ్డి, ఎం.రాజవర్ధన్‌రావు, టి.శ్రీనివాసులు, వి.వెంకటేష్, డి.రమణారెడ్డి, పి.చిన్న, జె.రంజాన్‌బీ, ఎం.సుస్మితారాణి తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు అబ్దుల్‌హై వీరిచే ప్రమాణం చేయించారు. యూటీఎఫ్ నాయకులు పి.బాలవెంకటేశ్వర్లు, పోలు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఉద్యమ నేతల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాదకరంగా ఫ్లైఓవర్ సర్వీసు రోడ్లు


ప్రమాదకరంగా ఉన్న ఫ్లై ఓవర్

కంభం: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా అనంతపురం–అమరావతి హైవేపై ఉన్న ఫ్లైఓవర్ సర్వీసు రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఫ్లైఓవర్ కు ఎడమవైపు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి ఉండగా, కుడి వైపు నుంచి పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, వ్యవసాయాధికారి కార్యాలయం, ట్రెజరీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి ఉంది. హైవేపై ఫ్లైఓవర్‌లు ఉన్నప్పుడు ఇరువైపులా సర్వీసు రోడ్లు పెద్దగా ఉంటాయి. కానీ కంభంలో సర్వీసు రోడ్లు ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వందలాది వాహనాలు, రైల్వే స్టేషన్‌కు ఆటోల్లో ప్రయాణికులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు వెళ్తుంటారు. ఫ్లైఓవర్ వద్ద అనేక సార్లు రోడ్డు ప్రమాదాలు జరగగా కొన్ని సందర్భాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ఫ్లైఓవర్‌కు ఇరువైపులా వెళ్లేందుకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి తగు సూచికలు, హెచ్చరిక బోర్డులు పెట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లి, తిప్పాయపాలెం గ్రామాల్లో సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతుల మీదుగా రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు.